క్లుప్తంగా

3న మండల సమావేశం

కొత్తూరు: కొత్తూరు మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఈ నెల 3వ తేదీన ఎంపీపీ మధుసూదన్‌రెడ్డి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ అరుంధతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు మండల సమావేశం ప్రారంభమవుతుందని, సమావేశం అనంతరం సభ్యుల పదవీ కాలం ముగియనుండడంతో వారికి వీడ్కోలు సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఆమె పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఎంపీటీసీలు, మండల స్థాయి అధికారులు పాల్గొనాలని ఆమె కోరారు.

వైద్యులు దేవుడితో సమానం



కేక్ కట్ చేస్తున్న డాక్టర్లు, సిబ్బంది

నందిగామ: వైద్యులు దేవుడితో సమానమని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు చెన్నగళ్ల అశోక్ మాదిగ అన్నారు. మండల కేంద్రమైన నందిగామలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జాతీయ వైద్యుల దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అశోక్ హాజరై డాక్టర్లు, వైద్య బృందంతో కేక్ కట్ చేయించి డాక్టర్స్ డే శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ డాక్టర్ అనమ్ నజం, సూపర్‌వైజర్ అమృత, ఫార్మాసిస్ట్ రాజశేఖర్, ల్యాబ్ టెక్నీషియన్ యాదగిరి, ఏఎస్‌ఎం స్వరూప, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్‌ఐ శ్రీకాంత్‌రెడ్డిని కలిసిన బీజేపీ నాయకులు



ఎస్‌ఐ శ్రీకాంత్‌రెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

చేవెళ్ల: చేవెళ్ల పోలీస్‌స్టేషన్‌కు ఇటీవల కొత్తగా వచ్చిన ఎస్‌ఐ శ్రీకాంత్‌రెడ్డిని మండల బీజేపీ నాయకులు కలిశారు. సోమవారం పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌ఐని కలిసిన నాయకులు ఆయనకు శాలువాతో సన్మానించి స్వాగతం పలికారు. ఎస్‌ఐని కలిసిన వారిలో నాయకులు ఇంద్రాసేనారెడ్డి, అశోక్, చంద్రశేఖర్‌రెడ్డి, మచ్చేందర్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

చేవెళ్ల పోలీస్ స్టేషన్‌లో నూతన సీఐలకు సన్మానం



సిబ్బందికి స్వాగతం పలుకుతున్న సీఐ లక్ష్మారెడ్డి, ఎస్‌ఐలు శ్రీకాంత్‌రెడ్డి, ప్రదీప్‌కుమార్

చేవెళ్ల: చేవెళ్ల పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌ఓగా నూతనంగా వచ్చిన సీఐ భూపాల్‌శ్రీధర్, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్‌గా జి.రమేశ్‌నాయుడులు బాధ్యతలు స్వీకరించారు. సైబరాబాద్ పరిధిలో జరిగిన బదిలీలలో వారు సోమవారం చేవెళ్ల పోలీస్‌స్టేషన్‌లో చార్జి తీసుకున్నారు. ఈ సందర్భంగా చేవెళ్ల పోలీస్‌స్టేషన్‌లో గతంలో ఉన్న సీఐ లక్ష్మారెడ్డి నూతన సీఐ భూపాల్‌శ్రీధర్‌కు బాధ్యతలు అప్పగించారు. చేవెళ్ల పోలీస్‌స్టేషన్‌కు కొత్తగా డీఐ(డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్)గా జి.రమేశ్‌నాయుడు చేవెళ్ల, మొయినాబాద్, షాబాద్ పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో డీఐ ఇన్‌స్పెక్టర్‌గా పని చేయనున్నారు. చేవెళ్ల పోలీస్‌స్టేషన్‌కు ఇటీవల ఎస్‌ఐ శ్రీకాంత్‌రెడ్డి కూడా బదిలీపై కొత్తగా రావటంతో చేవెళ్ల పోలీస్‌స్టేషన్‌లో ఇద్దరు సీఐలు, ఎస్‌ఐ ముగ్గురు కొత్తవారే కావటం విశేషం. నూతనంగా వచ్చిన సీఐలకు పోలీస్‌స్టేషన్ ఎస్‌ఐలు, సిబ్బంది స్వాగతం పలికారు. అనంతరం కొత్తగా వచ్చిన సీఐలు చేవెళ్ల ఏసీపీ కిషన్‌ను కలిశారు.

ఘనంగా అక్షరాభ్యాసం



అక్షరాభ్యాసంలో పాల్గొన్న చిన్నారులు, తల్లితండ్రులు

షాద్‌నగర్‌రూరల్: పట్టణంలోని రవీంద్రభారతి పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు సతీశ్ ఆధ్వర్యంలో సోమవారం చిన్నారులకు అక్షరాభ్యాస కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లితండ్రులు తమపిల్లలను తీసుకొచ్చి అక్షరాభ్యాసం చేయించారు. చిన్నారుల తల్లితండ్రులు పురోహితుల ఆధ్వర్యంలో చిన్నారులకు అక్షరాలు(ఓనమాలు) దిద్దించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, చిన్నారుల తల్లితండ్రులు తదితరులు పాల్గొన్నారు.

వన మహోత్సవానికి సన్నద్ధం

- నర్సరీల్లో ఏపుగా పెరిగిన మొక్కలు
- ఈ ఏడాది 2.46లక్షలు నాటడమే లక్ష్యం
- ఇప్పటికే గుంతలు తీస్తున్న కూలీలు
- ప్రణాళిక సిద్ధం చేసిన అధికారులు



గొల్లూరుగూడలో సిద్ధంగా ఉన్న మొక్కలు



సర్దార్‌నగర్ నర్సరీలో నాటేందుకు సిద్ధంగా ఉన్న మొక్కలు

షాబాద్: కాలుష్యాన్ని నివారించడంతో పాటు రాష్ట్రంలో అటవీ విస్తీర్ణాన్ని పెంచేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన వన మహోత్సవం కార్యక్రమానికి అధికార యంత్రాంగం సన్నాహాలు చేస్తోంది. ఇందుకోసం అవసరమైన మొక్కలను ఇప్పటికే గ్రామాల్లోని నర్సరీల్లో సిద్ధం చేయిస్తోంది. నర్సరీల్లో నీడనిచ్చే, పండ్ల మొక్కలు ఉండగా వాటి సంరక్షణ చర్యలను క్షేత్రస్థాయిలో ఎప్పటికప్పుడూ అధికారులు పర్యవేక్షిస్తున్నారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో ఆయా గ్రామాల్లో రోడ్ల పక్కన, పాఠశాలలు, ప్రభుత్వం కార్యాలయాలు, గుట్టల్లో మొక్కలు నాటేందుకు అధికారులు ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నారు.

అన్ని గ్రామ పంచాయతీల్లో నర్సరీలు..

వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటేందుకు అధికారులు సన్నద్ధమయ్యారు. మండల వ్యాప్తంగా 41 గ్రామ పంచాయతీల్లో 41 నర్సరీలను ఏర్పాటు చేశారు. ఆయా నర్సరీల్లో 4లక్షల పైగా మొక్కల పెంపకాన్ని చేపట్టారు. ఈ ఏడాది మండల వ్యాప్తంగా 2.46లక్షల మొక్కలు నాటడమే లక్ష్యంగా ఏర్పాట్లు చేస్తున్నారు. మండలంలోని గోల్లూర్‌గూ, సర్దార్‌నగర్, బొబ్బిలిగామ, హైతాబాద్ వన నర్సరీల్లో 70 శాతం మొలక శాతం ఉండగా మిగిలిన గ్రామాల్లోని నర్సరీల్లో నాటేందుకు వీలుగా మొక్కలు ఎదిగాయి. ఆయా నర్సరీల్లో పండ్లు, నీడనిచ్చే, పూల మొక్కలు, టేకు, కర్జూరా, చింత తదితర మొక్కలు ఉన్నాయి. ఒక్కో గ్రామ పంచాయతీలో కనీసం 6వేల నుంచి 11వేల వరకు మొక్కలను పెంచుతున్నారు.

తొలకరి వర్షాలు కురుస్తుండడంతో..

ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటడానికి అధికారులు ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నారు. మరో పది రోజుల్లో పండగలా మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించాలని, అదేవిధంగా ఇంటింటికీ మొక్కలు పంపిణీ చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రధానంగా ఈ ఏడాది రోడ్ల వెంట మొక్కలు నాటేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. అదేవిధంగా రోడ్ల పక్కన, పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు, గుట్టల్లో మొక్కలు నాటేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు.

ఏర్పాట్లు చేస్తున్నాం



వర్షాలు కురుస్తుండడంతో మొక్కలు నాటేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. మండలంలోని 41 గ్రామాల్లో నర్సరీలు ఏర్పాటు చేశాం. ఈ నర్సరీల్లో 2 లక్షలకు పైగా మొక్కలు పెంచుతున్నాం. ప్రస్తుతం మొక్కలు నాటే దశకు ఎదిగాయి. ఆయా నర్సరీల్లో పండ్లు, నీడనిచ్చే, పూల మొక్కలు, టేకు, కర్జూర, చింత తదితర మొక్కలు ఉన్నాయి. ఈ ఏడాది మండల వ్యాప్తంగా 2.50 లక్షల మొక్కలు నాటేందుకు ప్రణాళిక సిద్ధం చేశాం

-వీరాసింగ్, ఏపీఓ, షాబాద్

ప్రయాణికుల సౌలభ్యమే లక్ష్యం



బస్సులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్: ప్రయాణికుల సౌలభ్యమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. షాద్‌నగర్ ఆర్టీసీ డిపోకు నూతనంగా వచ్చిన 9 బస్సులను ఆయన సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనలో ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికులు కీలక పాత్ర పోషించారన్నారు. గత ప్రభుత్వం ఆర్టీసీతో చెలగాటం ఆడిందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్టీసీ అభ్యున్నతే లక్ష్యంగా ముందుకు సాగుతుందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాటకు అనుగుణంగా మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పిస్తున్నట్లు తెలిపారు. షాద్‌నగర్ బస్ డిపోకు మరిన్ని కొత్త బస్సులు త్వరలో తీసుకొచ్చేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. అన్ని గ్రామాలకు బస్సు సౌకర్యాన్ని కల్పిస్తామన్నారు. షాద్‌నగర్ నుంచి చేగూరు వరకు నూతనంగా ప్రారంభించిన బస్సులో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రయాణించారు. ఈ సందర్భంగా బస్సులో ప్రయాణికులతో ఎమ్మెల్యే ముచ్చటించారు. ఉచిత బస్సు ప్రయాణం ఎలా ఉందో మహిళలను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా షాద్‌నగర్ బస్టాండ్ ఆవరణలో ఏర్పాటు చేసిన ఆర్‌ఓ ప్లాంట్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ వెంకట్రామిరెడ్డి, బాబర్‌ఖాన్, తిరుపతిరెడ్డి, బాల్‌రాజ్‌గౌడ్, రఘు, చల్లా శ్రీకాంత్‌రెడ్డి, భార్గవ్‌కుమార్, నర్సింహారెడ్డి, సురేశ్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, ముబారక్ అలీ, అందె మోహన్, జాంగారి రవి తదితరులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

పీసీసీ ప్రధాన కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి



పార్టీలో చేరిన వారితో మధుసూదన్‌రెడ్డి, తదితరులు

షాబాద్: కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని చందనవెళ్లి కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కావలి చంద్రశేఖర్, పార్టీ సీనియర్ నాయకుడు చేవెళ్ల స్వామి, గ్రామ కమిటీ అధ్యక్షుడు గడీల కిష్టయ్య ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ పార్టీ నుంచి తాజా మాజీ ఉపసర్పంచ్ ప్రమీల వెంకటేశ్, మాజీ వార్డుసభ్యులు గుర్రం రమేశ్, కందివనం రామస్వామి, నాయిబ్రహ్మ రామస్వామి, చిప్పలపల్లి నరహరి, ఇబ్రహీం, దాసరి సత్తయ్య, నర్సింహులు, రాజమల్లు, మల్లేశం, కుమార్ తదితరులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా మధుసూదన్‌రెడ్డి వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు ఆరు గ్యారంటీల అమలు విషయంలో చిత్తశుద్ధితో పనిచేస్తుందన్నారు. రాష్ట్రంలో నియంత పాలన పోయి బడుగు, బలహీన వర్గాల ప్రభుత్వం వచ్చిందని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీలు పేదల జీవితాల్లో వెలుగులు నింపుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు జనార్దన్‌రెడ్డి, చేవెళ్ల స్వామి, నరసింహారావు, వేమారెడ్డి, మల్లేశ్, రాఘవేంద్రర్, గోపాల్, వెంకటేశ్, యాదగిరి, ప్రవీణ్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, రవిచంద్రన్, శ్రీనివాస్‌యాదవ్, నరేశ్‌యాదవ్, రంగయ్య, రాంచందర్, దయాకర్‌రెడ్డి, మహేందర్, వెంకటేశ్, కిష్టయ్య, సత్తయ్య, మల్లేశ్, ప్రవీణ్ ఉన్నారు.

అర్హులందరికీ ఆరు గ్యారంటీలు

ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి



తుర్కగూడలో రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

ఇబ్రహీంపట్నం: మండల పరిధిలోని చర్లపటేల్ గూడ, తుర్కగూడ గ్రామాల్లో సీసీరోడ్లను సోమవారం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ప్రారంభించారు. చర్లపటేల్‌గూడలో రూ.27.5 లక్షలు, తుర్కగూడలో రూ.10 లక్షలతో పనులు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అన్నివర్గాల ప్రజా సంక్షేమం, అభివృద్ధి కోసం పనిచేస్తోందన్నారు. ఆరు గ్యారంటీలు అర్హులందరికీ అందుతాయని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ కృపేశ్, జెడ్పీటీసీ భూపతి గాళ్ల మహిపాల్, ఎంపీడీఓ వెంకటమ్మ, మండల ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు భరత్‌రెడ్డి, ఎంపీటీసీ ఆంజనేయులు, మాజీ ఉపసర్పంచ్ నరేందర్‌రెడ్డి, డీఈ శ్రీనివాస్, ప్రత్యేకాధికారులు వరప్రసాద్, ప్రణీత్, నాయకులు పాల్గొన్నారు.

పైపులైన్ గుంత పూడ్చివేత



గుంతను పూడుస్తున్న సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

మొయినాబాద్‌రూరల్: మండల పరిధిలోని హిమాయత్‌నగర్ గ్రామంలో ఆయా గ్రామాలకు వెళ్లే రోడ్డు పక్కన పైపులైన్ లీకేజీల మరమ్మతుల పేరుతో సిబ్బంది గుంత తవ్వి నిర్లక్ష్యంగా వదిలేయడంతో తవ్వారు.. మరిచారు.. అనే శీర్షికన శుక్రవారం ప్రచురితమైన కథనానికి పంచాయతీ కార్యదర్శి, సిబ్బంది స్పందించారు. పంచాయతీ కార్యదర్శి సోమవారం సిబ్బందితో పైపులైన్ పనులు చేయించారు. అదే విధంగా గుంతను పూడ్చి వేయించారు. దీంతో స్థానికులు, వాహనదారులు సాక్షి పత్రికకు కృతజ్ఞతలు తెలిపారు.

సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరం



సాయి గణేశ్‌రెడ్డికి ఎల్‌ఓసీ అందజేస్తున్న భీంభరత్, సత్యనారాయణరెడ్డి

షాబాద్: సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరంలా మారిందని కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల అసెంబ్లీ ఇన్‌చార్జి పామెన భీంభరత్, రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ సభ్యుడు చింపుల సత్యనారాయణరెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని ఏట్ల ఎర్రవల్లి గ్రామానికి చెందిన పట్లోళ్ల సాయి గణేశ్‌రెడ్డికి సీఎంఆర్‌ఎఫ్ ద్వారా మంజూరైన ఎల్‌ఓసీని నగరంలోని మినిస్టర్ క్వార్టర్స్‌లో వారు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆపదలో ఉన్న ప్రతి కుటుంబాన్ని ఆదుకునేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు వేణు, రాఘవేందర్ తదితరులు ఉన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

ఏఓ పద్మావతి



విత్తన దుకాణంలో తనిఖీలు చేస్తున్న అధికారిణి

కొందుర్గు: విత్తనాలు, ఎరువుల వివరాలు ఎప్పటికప్పుడూ నమోదు చేయాలని ఏఓ పద్మావతి సూచించారు. ఎరువుల దుకాణాల తనిఖీలలో భాగంగా సోమవారం మండల కేంద్రంలోని వివిధ ఎరువులు, విత్తనాల దుకాణాలను ఆమె తనిఖీ చేసి రసీదు, స్టాక్ వివరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రైతులకు అవసరమైన మేరకు ఎరువులు, విత్తనాలు అందించాలని సూచించారు. ప్రభుత్వ నిబంధనలను పాటించకుండా నిర్లక్ష్యం వహిస్తే తగు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఈఓ అనూష పాల్గొన్నారు.

అండగా ఉంటా .. అధైర్యపడొద్దు

మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి

చేవెళ్ల: బీఆర్‌ఎస్ పార్టీని కొంతమంది వీడిన పార్టీకి ఎలాంటి నష్టం లేదని, పార్టీ నాయకులు, కార్యకర్తలందరికీ నేను అండగా ఉంటానని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డి అన్నారు. చేవెళ్ల మండలానికి చెందిన బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో సోమవారం ఆమెను కలిశారు. చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య బీఆర్‌ఎస్ పార్టీని వీడిపోవటంతో పార్టీలో ఉన్న నాయకులు, కార్యకర్తలు తమకు అండగా నిలబడాలని ఆమెను కోరారు. ఈ సందర్భంగా ఆమె వారితో మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ ఉద్యమ పార్టీ అని, ఉద్యమం నుంచి వచ్చిన నాయకులు, కార్యకర్తలు బీఆర్‌ఎస్ పార్టీకి బలమని పేర్కొన్నారు. కొంతమంది నాయకులు పార్టీలోకి వచ్చి పోయినంత మాత్రానా పార్టీకి ఎలాంటి నష్టం లేదన్నారు. కేసీఆర్, కేటీఆర్ నాయకత్వంలో పార్టీని బలోపేతం చేసుకుందామని చెప్పారు. చేవెళ్ల బీఆర్‌ఎస్ పార్టీ నాయకులకు నేను అండగా ఉంటానని ఎవరూ అధైర్యపడొద్దన్నారు. పార్టీలో ఉంటూ పార్టీని కాపాడుకుంటే రాబోయేవి మంచిరోజులు వస్తాయని చెప్పారు. త్వరలోనే చేవెళ్లలో నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించుకుందామని చెప్పారు. ఎమ్మెల్యేను కష్టపడి గెలిపించుకుంటే ఆయన అందరిని మోసం చేశారని విమర్శించారు. ఆమెను కలిసి వారిలో డీసీఎంఎస్ చైర్మన్ పి. కృష్ణారెడ్డి, నియోజకవర్గ నాయకులు దేశమోళ్ల ఆంజనేయులు, చేవెళ్ల నాయకులు మాజీ ఎంపీపీ ఎం.బాల్‌రాజ్, మండల అధ్యక్షుడు ప్రభాకర్, మినిమం వెజ్‌బోర్డు మాజీ చైర్మన్ నారాయణ, కార్యకర్తలు ఉన్నారు.



మాజీ మంత్రి సబితారెడ్డితో చేవెళ్ల నాయకులు, కార్యకర్తలు

అవినీతికి పాల్పడితే వేటు తప్పదు

భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా అధ్యక్షుడు గడిగె గజేందర్‌గౌడ్



విద్యుత్ ఏఈ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న గజేందర్‌గౌడ్

షాబాద్: విద్యుత్ నిర్వహణ పనుల్లో సిబ్బంది అవినీతికి పాల్పడితే వేటు తప్పదని భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా అధ్యక్షుడు గడిగె గజేందర్‌గౌడ్ పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలో భారతీయ కిసాన్ సంఘ్ ఆధ్వర్యంలో రైతులతో మండల సమావేశం నిర్వహించారు. అనంతరం విద్యుత్ కార్యాలయంలో విద్యుత్ సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డీటీఆర్‌ల నిర్వహణలో రైతులను విద్యుత్ సిబ్బంది వేధించి డబ్బులు వసూలు చేస్తున్నట్లు సంఘం దృష్టికి వచ్చినట్లు ఆయన తెలిపారు. గ్రామాల్లో లైన్ల పునఃరుద్ధరణ డీటీఆర్‌ల నిర్వహణ విషయంలో డబ్బులు డిమాండ్ చేసినట్లు ఆరోపించారు. అదే విధంగా రెవెన్యూ సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని తహసీల్దార్ ఎండీ అన్వర్‌ను కోరారు. అనంతరం భారతీయ కిసాన్ సంఘ్ మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా దండు యాదవరెడ్డి, కార్యదర్శిగా దోనూరి కృష్ణ, కోశాధికారిగా కలాల్ చంద్రయ్యలతో పాటు 14 మంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యుడు సత్యనారాయణరెడ్డి, వివిధ గ్రామాల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు తదితరులు ఉన్నారు.

రోడ్డు ఇలా.. ప్రయాణం ఎలా?



రోడ్డుపైన నిలిచిన నీరు

కేశంపేట గ్రామంలోని వైఎస్సార్ చౌరస్తా నుంచి కాకునూర్ వెళ్లే రోడ్డు చెరువును తలపిస్తోంది. అధికారుల నిర్లక్ష్యం కారణంగా చౌరస్తా వద్ద నీరు నిలుస్తోంది. గ్రామ కూడలి రోజు వాహనాల రాకపోకలతో రద్దీగా ఉంటుంది. రోడ్డుపైనే మోకాళ్లలోతు వరకు నీరు నిల్వ ఉండటంతో పాదాచారులు, వాహనదారులు ఈ రోడ్డు నుంచి వెళ్లేందుకు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు స్పందించి రోడ్డుపై వర్షపునీరు నిల్వ ఉండకుండా తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు, వాహదారులు కోరుతున్నారు.

-కేశంపేట

విద్యారంగ సమస్యలపై నిరంతర పోరాటం

ఎస్‌ఎఫ్‌ఐ చేవెళ్ల డివిజన్ అధ్యక్షుడు ఎర్రవల్లి శ్రీనివాస్



నూతన కమిటీతో శ్రీనివాస్, తదితరులు

షాబాద్: విద్యార్థుల సమస్యలపై ఎస్‌ఎఫ్‌ఐ నిరంతరం పోరాటం చేస్తుందని ఎస్‌ఎఫ్‌ఐ చేవెళ్ల డివిజన్ అధ్యక్షుడు ఎర్రవల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలోని బాలుర జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల సమస్యలు తెలుసుకునేందుకు ఎస్‌ఎఫ్‌ఐ కమిటీని ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్‌ఎఫ్‌ఐ విద్యార్థుల సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తూ దేశంలోనే అతిపెద్ద విద్యార్థి సంఘంగా ఎదిగిందన్నారు. షాబాద్ ఉన్నత పాఠశాలలో తాగడానికి నీళ్లు కూడా లేవన్నారు. జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి పాఠశాలలో ఉన్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. లేనిపక్షంలో ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో విద్యార్థులతో ఆందోళన చేస్తామన్నారు. స్కూల్ కమిటీ ఎస్‌ఎఫ్‌ఐ అధ్యక్షుడిగా పి.కార్తీక్, ఉపాధ్యక్షులుగా బి.అవినాశ్, సాయికృష్ణ, సి.మోహన్‌కృష్ణ, రాజేశ్, ప్రధాన కార్యదర్శిగా సంపత్, సహాయ కార్యదర్శిగా విశాల్, వెంకటేశ్, సందీప్, ధనూశ్, 30 మంది కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు.

రథయాత్రపై సన్నాహక సమావేశం



రథయాత్ర పోస్టర్ ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

ఆమనగల్లు: పట్టణంలో ఈ నెల 12న ఇరవై వేల మందితో పూరీ జగన్నాథ రథయాత్ర నిర్వహిస్తున్నట్లు ఆ రథయాత్ర నిర్వహణ వ్యవస్థాపక ప్రముఖ్ పాపిశెట్టి రాము, కన్వీనర్ తల్లోజు వెంకటయ్య, శోభాయాత్ర ప్రముఖ్ ఎంగలి బాలకృష్ణ పేర్కొన్నారు. నగరంలోని కూకట్‌పల్లి ఇస్కాన్ దేవాలయం సహకారంతో నిర్వహించే రథయాత్రకు భారీ ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. పట్టణంలోని హనుమాన్ ఆలయంలో సోమవారం జగన్నాథ రథయాత్ర సన్నాహక సమావేశం నిర్వహించారు. సమావేశానికి ఆమనగల్లు, కడ్తాల, మాడ్గుల, తలకొండపల్లి, వెల్దండ మండలాలకు చెందిన భక్తులు హాజరయ్యారు. ఈ సందర్భంగా రథయాత్రకు సంబంధించి కరపత్రాలు, వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో రథయాత్ర నిర్వాహకులు అంజయ్య, మోహన్‌రెడ్డి, భద్రయ్య, శ్రీనివాస్‌రెడ్డి, మాధవాచారి, కృష్ణయ్య, మనోహర్, లోహిత్‌రెడ్డి, శ్రీశైలం, వంశీ, టిల్లుయాదవ్, భరత్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.